# ఒక రాధ కథ



ఇందిరాదేవి

నెలల పిల్లగా వున్నప్పుడు ఎంతో ముద్దొచ్చేది రాధ. కానీ తల్లి జానకమ్మ ఎప్పుడూ ముద్దు పెట్టుకునేది కాదు. ఏ పేటా కాన్పులతో, బీద తనంతో, అహర్నిశలూ చాకిరీతో సతమవుతూండే ఆవిడకి కూతుర్ని ముద్దాడటానికి తీరికగాని ఓపికగాని లేదు. నడుచుకుంటూ తండ్రి దగ్గిరికి వెళ్తే 'ఛీ—పోవే మొద్దూ-నాకు పనుంది అవతల' అని విసుక్కునేవా డాయన.

కొంచెం జ్ఞానం వచ్చింది రాధకి.

అందరు తల్లులూ పిల్లల్ని ముద్దు చేస్తుంటే, పిండివంటలు చేసి పెడుతుంటే ఆశగా చప్పరించేది. బజారునుంచి మంచి మంచి బొమ్మలూ, కొత్త బట్టలూ కొనితెచ్చి పెడుతుంటే కళ్ళు ఇంతింతలు చేసుకుని చూసేది. దుఃఖం ముంచుకొచ్చేది. ఆ పిల్లల మీద కచ్చ పుట్టుకొచ్చేది.

అమ్మా నాన్నలని అడిగి అడిగి విసిగి పోయింది. పాత చీరల్లో చింపి కూతుళ్ళకు గౌన్లు కుట్టేది జానకి. ఎప్పుడైనా కొత్త గౌను కొన్నా చీటీదే కొనేది - పని రాధకేం తెలుసు ఇంతమందిని పోషించే స్తోమత నాన్నకి లేదనీ - సమర్థించుకుని చాకిరీ చేసే ఓపిక తల్లికి లేదనీ?

చిన్న చిన్న కోరికలు కూడా తీరకుండా ఉండి పోయేయి రాధకి. అంత చిన్నప్పట్నించీ అసం తృప్తి, దుఃఖం ఆమె గుండెలో నివాసం ఏర్పరచు కున్నాయి. "ఆఖరికి రిబ్బన్లూ, చాక్లెట్లూ కూడా కొనిపెట్టరు అమ్మా నాన్నా. ఛీ - వాళ్ళు మంచి వాళ్ళుకారు - నేను అందంగా ఉండను కాబోలు నాకేం కొని పెట్టరు - అన్నీ అక్కయ్యలకే కొంటారు. ఇంక అన్నయ్య సంగతి సరేసరి" అని బాధ పడేది.

ఒకరోజు విసుక్కుంటూ జడ వేస్తున్నది రెండో అక్కయ్య భార్గవి. నెమ్మదిగా జంకుగా "అక్కయ్యా; వాళ్ళ శాంత రోజూ రెండు జడలు వేసుకుంటుంది గదే - నా కివ్వాళొక్కసారీ వెయ్యవూ?" అని అడిగింది రాధ.

"ఆఁ నీ మొహానికి తోడు రెండు జడలు తక్కువైనాయా? వెధవ్వేషాలు వెయ్యకు. నాకు చిరాకొస్తుంది. తొందరగా నా ఫ్రెండింటికి పోదా మనుకుంటుంటే నీకు జడెయ్యమని పురమాయిం చింది అమ్మ. వెధవ ఇల్లూ - వెధవ చాకిరీ. చస్తు న్నాను" అని గబగబా ఒకే జడేసి వెళ్ళిపోయింది.

భరించలేని ఉక్రోషం వచ్చింది రాధకి. కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. అద్దం పెంకులో మొహం చూసు కుంది. జిడ్డుగా వుంది. "హుఁ నేనే గనక సబ్బెట్టి తోముకుంటే వాళ్ళ శాంతకంటే బానే వుంటాను. కానీ నాన్న సబ్బు తేనేతేడుగా. ఎప్పుడూ ఆ దిక్కుమాలిన సున్నిపిండీ, కుంకుడు కాయా - ఛీ -" అనుకుంది.

ఆ సాయంత్రం నీళ్ళు పోసుకోనని మొరాయిం చింది రాధ. అక్కయ్యల ద్వారా తల్లికి చేరిందీ వార్త. గరిటెతో సహా పెరట్లోకి వచ్చి "ఏమే, ఏమొచ్చిందే నీకు మాయరోగం?" అని అడిగిం దావిడ.

"సబ్బు కావాలి" అన్నది రాధ జంకకుండా.

"ఆఁ వేలెడు లేవు - సబ్బు కావాలేం సబ్బు - నీ అందానికి తోడు అదొక్కటే తక్కువైంది. వేషాలెయ్యకుండా నీళ్ళు పోసుకో ముందు" అని కోప్పడింది.

రాధ కదల్లేదు - అలాగే నిలబడిపోయింది.

జానకమ్మ కోపం అవధులు దాటింది. నాలుగు వడ్డించి బరబరా లాక్కెళ్ళి నీళ్ళుపోశా ననిపించిం దావిడ.

అసంతృప్తీ, కోపం, దుఃఖం ముంచుకు వచ్చాయి రాధకు. తల్లి అన్నానికి పిలిస్తే వెళ్ళ లేదు. తల్లి బతిమాలినా, కూడా రాధ ఆ రోజు అన్నం తినలేదు.

ఆకలేస్తున్నా సరే అన్నం తినకుండా అట్లాగే నిద్రపోయింది రాధ. "ఛీ - మా అమ్మకు నా మీద అస్సలు ప్రేమ లేదు. ఎప్పుడూ తిడుతూనే వుంటుంది" అనుకున్నది. కానీ ఆ పూట తాను తినలేదని తల్లి కూడా అన్నం మానేసిందని ఆమెకు తెలియలేదు.

ఎందుకో అందుకు రోజూ ఏడుస్తూనే వుండేది రాధ. జానకమ్మ ఓర్పు నశించిపోయింది. తత్ఫలితంగా రాధకి రోజూ దెబ్బలు తగిలేవి. పిల్లలో కళలేదు. నైరాశ్యం గూడుకట్టుకున్న ముఖం—ఆ పిల్ల ఈడు వాళ్ళంతా ఉత్సాహంగా కేరింతలు కొడుతూంటే తను దిగులుగా ఒక చోట కూర్చునేది. ప్రపంచంలో తనెందుకూ కొరగానిదనే అభిప్రాయం ఆమె పసి మనసులో నాటుకుపోయింది. ఆత్మవిశ్వాసం నశించింది. తల్లి తిట్లూ తండ్రినిరసనా ఆమెను అమితంగా క్రుంగదీశాయి — "పనికిమాలినదానా, దరిద్రపు మొహమా! ఏకుపుగొట్టు పెద్దమ్మా!" అని రకరకాలుగా తిట్టేది తల్లి. పిల్లది సున్నిత హృదయం. ఒక్కొక్క తిట్టూ ఆమె గుండెలో బాణంలా గుచ్చుకుంటాయన్న జ్ఞానం లేదావిడకి.

తల్లిదండ్రుల తిట్లకు మొదట్లో ఉక్రోషపడేది రాధ. కాని రానురాను తను నిజంగా చచ్చుదద్దమ్మే కాబోలు అనుకునేది — పదేపదే తననీ, తన అసమర్థతను నిందించుకుంటూ ఏపని చేయ బోయినా ఆమె చేతయ్యేదికాదు. ఇంట్లో అందరికీ మరింత లోకువయ్యేది. ఎప్పుడూ ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఏడుస్తూ కూచునేది. అత్యంత సున్నితమూ, మృదుమధురమూ, ఆపేక్షా పూరితమూ అయిన ఆ బాలిక హృదయం కఠిన దంష్ట్రలమధ్య చిక్కుకుని నలిగిపోతోంది.

రాధను స్కూల్లో చేర్చారు. బీదగా, జాలిగా అమాయకంగా వుండే ఆ పిల్లనీ, ఆమె పిచ్చి వాలకాన్నీచూసి స్కూలు పిల్లలకి ఆశ్చర్యం కలిగింది. ఖాళీ దొరికినప్పుడల్లా రాధ చుట్టూ మూగేవాళ్ళు అందరూ. ఆమెను నానా రకాలుగా వేళాకోళం చేసేవారు.

"అరె. అమ్మ మాటలు నిజమే. నేను ఎందుకూ పనికిరానని వీళ్ళూ అంటున్నారు" అని తన అసమర్థతను రూఢీ చేసుకున్నది రాధ.

ఇద్దరు ముగ్గురు మాత్రం మంచి అమ్మాయి లుండేవాళ్ళు. "మరీ అంత అమాయకంగా ఉండకు రాధా! గడుసుగా వుంటే నీ జోలికిరారు. మేమూ బీదవాళ్ళమే. కానీ వాళ్ళు మమ్మల్ని ఎగతాళి చెయ్యగలుగుతున్నారా?" అని చెప్పే వాళ్ళు కానీ రాధకు గడుసుగా లౌక్యంగా వుండటం చేతకాలేదు.

ప్రతి క్లాసూ ఎట్లాగో ప్యాసైనానన్పించి చివరకి ఎస్సెల్సీ గట్టు కూడా దాటేసింది రాధ—ఇంట్లో వాళ్ళిచ్చే అమితమైన నిరుత్సాహానికి ఎదురొడ్డుతూ, ఇంటెడు చాకిరీ చేస్తూ, అనుక్షణమూ దుఃఖ పడుతూ, దిగులు పడుతూ ఆ పాఠాలు చదివి ప్యాసైనానన్పించుకునేటప్పటికి ఆ పిల్లలో వున్న శక్తికాస్తా చచ్చిపోయింది. అసలే మెదడుకి చురుకుదనం తక్కువ. తలప్రాణం తోకకి వచ్చింది.

ఇంక చదవవద్దన్నారు ఆమె తల్లిదండ్రులు. వాళ్ళ ఆదేశం ప్రకారమే మూడవ ఫారంతో పెద్దమ్మాయీ నాలుగవ ఫారంతో రెండో అమ్మాయీ, ఐదవ ఫారంతో మూడో అమ్మాయీ చదువు మానేసి ఇంట్లో కూర్చున్నారు. వాళ్ళకు పొద్దుపోదు. చవకరకం నవలలు చదవటం తప్పించి మరేం చెయ్యరు. పిల్లలకెట్లా పెళ్ళి చెయ్యటమో తోచక రాత్రీపగలూ దిగులు పడు తున్నారుతల్లిదండ్రులు. తను కూడా చదువు మానేసి గోళ్ళు గిల్లుకుంటూ ఎందుకు కాలక్షేపం చెయ్యాలో అర్థం కాలేదు రాధకి. దాంతో ఆమె చదువు మానెయ్యడానికి ఒప్పుకోలేదు. మూడు రోజులు ఏడ్చి, ఉపవాసాలు చేసి ఎట్లాగైతేనేం సాధించింది. కాలేజీలో చేరింది. ఆయేడే కాలేజీలో చేరాడు ఆమె అన్నయ్య రమణ కూడా.

కాలేజీలో కూడా దురదృష్టం వదలలేదు. ఎనభై మంది వుండే వాళ్ళు క్లాసులో. మగపిల్లలు 60 మందికి ఆమె విషయం పట్టలేదు. పట్టిందల్లా ఆడపిల్లలకే. రాధ నడిస్తే వింత. మాట్లాడితే వింత. తను ఎక్కడికి వెళ్తే అక్కడ ఈ అవహేళన ఏమిటో అంతుబట్టలేదు రాధకి. ఎంత నిర్లిప్తంగా వుందామనుకున్నా ఎత్తింది మనిషి జన్మ గనక మనసు గిలగిలలాడక తప్పటంలేదు.

రాధ అమాయకురాలే కావచ్చు. కానీ దుష్ట రాలుకాదు. బీదపిల్లే గాని మోసగత్తెకాదు. త్రికరణ శుద్ధిగా ఏ ప్రాణికీ హాని చెయ్యాలను కోదు. ఒక్కపైసా ఎవళ్ళనీ అడగదు. తల్లి అన్నం పెడితే తింటుంది లేకపోతే తినకుండానే కాలేజీకీ వెళ్తుంది.

ఎంత జాగ్రత్తగా, ఎంత నిర్వికారంగా వుందా మని చూసినా దుఃఖమయమూ, అవహేళనా భరితమూ అయిన జీవితమే ఎదురౌతున్నది. ఈ జీవితంలో ఎప్పటికైనా వెలుగురేఖ ప్రసరిస్తుందా? ముసురుకున్న చీకటిపటా పంచలౌతుందా — అను కుంటూ ఎదురుచూసేది రాధ.

కాలేజిలో బీ. జే. ఆర్. అని జువాలజీ డిమాన్ స్ట్రేటరొకాయన ఉండేవాడు. కొంచెం స్థూలదేహం ఆయనది. అందుకని అందరూ ఎగతాళి చేస్తారు. అసలాయన ఇంటి పేరు ఎవరికీ తెలీదుగాని బీ. అనే అక్షరానికి రెండు రూపాలు కల్పించి ముద్దుగా పిలుచుకునేవాళ్ళు బొండు జనార్దనరావనీ బడ్డూ జనార్ధనరావనీ.

ఒకరోజు రాధ దృష్టి అంతా కేంద్రీకరించి జువాలజీ ప్రాక్టికల్స్ చేస్తున్నది. జనార్దనరావు నెమ్మదిగా ఆమె వెనక్కు వచ్చి నిలబడ్డాడు. ఆమె గమనించలేదు. మెల్లిగా ఏదో అన్నాడు. ఆమె అది వినలేదు.

పక్క సీటులో అమ్మాయి హెచ్చరించేసరికి ఉలిక్కిపడింది. చూస్తే ఏముంది? వెనకాల మేస్టారు. అదో రకంగా వుందాయన మొహం.

వణికిపోయింది రాధ.

ఆయన కూడా చలించిపోయాడు. వెంటనే స్మృతిలోకివచ్చి గబగబా అక్కడినుంచి వెళ్ళి పోయాడు.

పక్కమ్మాయి చిత్రంగా చూస్తోంది.

రాధ పరిస్థితి అయోమయంగా వుంది. గుండె దడదడలాడుతోంది — ఆ మధ్య ఆమె ఒంట్లో ఏం బావుండటం లేదు. మందు ఇప్పించటానికి ఎవరికి పట్టింది?

తర్వాత వారం అయిందో లేదో — కెమిస్ట్రీ క్లాసుకు వెళ్తోంది నెమ్మదిగా నడుచుకుంటూ — ఎప్పుడూ అందరికంటే వెనకబడుతూనే వుంటుంది

రాధ—అంతలో ఎక్కడినుంచో గబగబా వచ్చాడు జనార్దనరావు. ఆమె చేతిలో ఒక కవరుపెట్టి గిరుక్కున వెళ్ళిపోయాడు.

ముచ్చెమటలు పోశాయి రాధకి.

ఆ కవరు పుస్తకాల్లో పెట్టేసుకుని ముందు వెళ్తున్న అమ్మాయిలను కలుసుకుంది. రమామణి అనే గడుగ్గాయి ఆమె బుజం మీదికి వంగి గుసగుసలాడింది "ప్రేమ లేఖా!" అని.

"ఛీ—ఎబ్బే" అని నీళ్ళు నమిలింది భయం భయంగా.

"ఆహా! ఏం నంగనాచివి? ఏమో అనుకున్నాం—కథానాయకురాలివేనన్నమాట. మొన్న జువాలజీ లాబ్‌లోనే అనుమానించాంలే మేము. నీ కంటే అందగత్తె దొరకలేదు గాబోలు నీ చుట్టూ తెగ తిరిగాడు మానవుడు—ఇంకేం దొందూ దొందే అన్నట్లు బావుంది జంట" అంటూ ఆ కవరు లాక్కొని తన పుస్తకాల్లో పెట్టుకుని గభాల్న వెళ్ళి క్లాసులో కూర్చుంది. గుడ్ల నీరు కుక్కుకుంటూ తను కూడా వెళ్ళి క్లాసులో కూర్చుంది రాధ. వెంటనే పాఠం మొదలుపెట్టాడు లెక్చరరు.

రాధ ముందునించే ఆ కవరు ఆడపిల్లలందరి దగ్గిరికీ చేరిపోయింది లెక్చరరు కళ్ళబడకుండా. అందరూ ఆ ఉత్తరం చదవి రాధవంక చూసి నవ్వుకోసాగారు.

మంచిదికానీ, చెడ్డదికానీ ఆ కవరు రాధకి సంబంధించింది. అది ఆమె చదవకుండానే అందరూ చదివేస్తున్నారు. "ఇదే కాబోలు కాలేజీ చదువు నేర్పుతున్న సంస్కారం. ప్రతివాళ్ళూ మాటకు ముందు కాలేజీ మగపిల్లలని ఆడిపోసుకుంటారు గానీ ఆడపిల్లలు చేసే అల్లరి గుర్తించరు. తడి గుడ్డలతో గొంతు కోస్తున్నారు వీళ్ళు" అని ఉద్విగ్నమై బాధపడింది రాధ మనసు.

ఆ రోజు అన్నం తినకుండా కాలేజీకి వచ్చింది. అనారోగ్యానికీ, నీరసానికీ హృదయంలో చెలరేగుతున్న బడబాగ్ని ఘోష తోడైంది. ఆ గంట అయిపోయాక నుంచోబోతూ కళ్ళు తిరిగి పడిపోయింది.

క్షణాల మీద చుట్టూ మూగారు జనం. కెమిస్ట్రీ మేడమ్ పద్మలత, ఫిజిక్స్ మేడమ్ సీత కూడా వచ్చారు ప్యూను చెప్పగానే. రాధ మొహాన్ని చన్నీళ్ళతో తుడిచి, తెలివి తెప్పించింది పద్మలత. ఇద్దరూ కలిసి వాళ్ళ రూముకు తీసుకెళ్ళారు. కాఫీ తెప్పించి తాగించింది సీత.

రాధ కాస్త తేరుకుంది - వాళ్ళ ఆప్యాయతకు చలించిపోయింది. "ఎందుకమ్మా—అలా పడిపోయావ్—ఏమైంది?" నింపాదిగా అడిగింది పద్మలత.

జరిగినదంతా ఒక్కక్షణంలో గుర్తుకు వచ్చింది. ఉగ్గబట్టుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది రాధ—చివరికి జరిగిందంతా చెప్పేసింది.

"ఏమిటీ? జనార్దనరావు నీకు ఉత్తరం ఇచ్చాడా—ఆశ్చర్యంగా వుందే! అంత ధైర్యం ఎక్కడి నుంచి వచ్చిందబ్బా? అసలు అతను అలాంటివాడు కాదే?" అన్నది పద్మలత.

సాలోచనగా తల పంకించింది సీత.

"ఈ మాత్రం దానికి ఇంత బాధపడ్డావా? మొరిగే కుక్కలు కరవవు రాధా! నీలో ధైర్యం ఉండాలేగానీ నిన్ను వాళ్ళేం చెయ్యలేరు. మీ క్లాసు పిల్లలేం పతివ్రతలు కారులే. శీలానికి నిదర్శనంగా, మంచితనానికి మారు పేరుగా, వినయానికి ప్రతీకగా వుండే నీలాంటి అమ్మాయి ఉనికిని సహించలేక పోతున్నారు. అంతే!" అంటూ రాధ భుజం మీద ఆప్యాయంగా చెయ్యి వేసింది పద్మ·

రాధ దిగ్భ్రమగా చూసింది.

"స్టూడెంట్స్ సంగతి మాకు తెలుసులే. ఎవరెలాంటి వాళ్ళో తెలుసుకోలేమనుకున్నావా! నీ గురించి మెచ్చుకుంటుంటే ఆశ్చర్యపోతున్నావు. సరే దానికేంగాని, ఇంక నువ్విలా క్లాసులకు అటెండ్ కాలేవు. ఇంటికెళ్ళిపో" అన్నది సీత.

సీతా, పద్మా ఇద్దరూ ఎంతో దగ్గరయ్యారు రాధకి. ఈ ప్రపంచంలో ఆ పిల్లతో ఆదరంగా మాట్లాడిన వాళ్ళు వాళ్ళిద్దరే—"అబ్బ వాళ్ళు మనుషులు కారు—దేవతలు" అనుకుంది రాధ ఎన్నోసార్లు.

ఇంటికి వెళ్ళేసరికి అక్కడ నానా గోలగా వుంది— రెండో అక్క భార్గవి కన్పించటంలేదనీ—వెతగ్గా వెతగ్గా చివరికి ఎవరో గళ్ళచొక్కా తొడుక్కున్న అబ్బాయితో కలిసి రైలెక్కిందనీ.

తండ్రి తలపట్టుకు కూర్చున్నాడు. తల్లి కిందపడి రాగాలు పెడుతోంది. "ఆ అబ్బాయి ఎవరో—ఏమో హు! అతని కోసం అందర్నీ విడిచిపెట్టి, పరువు ప్రతిష్ఠలు మంటగలిపి - వెళ్ళిపోయిందా అక్కయ్య?" అని విస్తుపోయింది రాధ.

## పుస్తకాలు

### కల్పవృక్షం
[నవల]

**[రచన: ఆరెకపూడి కౌసల్యాదేవి; ప్రచురణ: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2. క్రౌన్ 1/8 సైజులో 194 పేజీలు. వెల: రూ. 6 లు. అట్టమీది బొమ్మ: బాపు]**

"ఎల్లప్పుడూ ధనికుల గాథలే కాని, సామాన్యుల కష్టసుఖాలు ఆలోచించి వ్రాయరేం?" అని అడుగుతున్న అభిమానుల కోరిక మేరకు — ఈ నవల రాసినట్టుగా — రచయిత్రి ముందు పేజీలో రాశారు. ఎవరి కోరిక మేరకు రాసినా — నిజంగా చక్కని నవల రాశారు. మధ్య తరగతి కుటుంబాల్లోని ఒడిదుడుకులు, ఆ కుటుంబాల్లో వచ్చే పాత్రలూ సహజంగా కళ్ళకు కట్టినట్టుగా వున్నాయి. మంచి సన్నివేశాలను కల్పించడంలో రచయిత్రి అనుభవం కనిపిస్తుంది. తల్లి, చెల్లెలూ-భార్య మధ్య నలిగిపోతూ, ఎటూ చెప్పలేక, భార్యనే కసురుకునే శేఖరం పాత్ర — అన్నిటినీ దిగమింగుతూ ఎక్కడి కక్కడ సర్దుకుపోతూ—మధ్య మధ్యలో వచ్చే ఉక్రోషాన్ని అణచుకోలేక, మాటలు విసర్లేక విసిరే ప్రభావతి పాత్ర సజీవంగా కనిపిస్తాయి. మంచి మనిషికి ప్రతి రూపంగా కనిపించే విమల; చెడ్డ మనిషికి మారు రూపంగా కనిపించే కామేశ్వరి మనకి తారసపడే వ్యక్తుల్లాగే కనిపిస్తారు. ఈ నవలలోని మరొక విశేషం—చకచకా నడవడం. సన్నివేశాల సందర్భంగా వచ్చిన సంభాషణలు కూడా సహజంగా నడిచాయి.

['పుస్తకాలు' శీర్షికలో సమీక్షకు పుస్తకాలు పంపేవారు — ఒక్క ప్రతిని పంపితేచాలు. అయితే, ఆ పుస్తకాలు స్త్రీల రచనలే అయి వుండాలి. అవీ ఈ సంవత్సరం (1976)లో ప్రచురింపబడినవే అయి వుండాలి. గత సంవత్సరంలో మాకు అందిన పుస్తకాలు మాత్రం వరసగా సమీక్షింపబడతాయి. వ. సం]

తన కుటుంబం సంగతులన్నీ తలుచుకుని రాధకు గుండె బరువెక్కిపోయింది. భవిష్యత్తు శూన్యంగా, అంధకారంగా కనిపించింది ఆమెకు. భార్గవి చేసిన సాహసం తల్చుకుని ఆమె మరీ మరీ బాధపడింది.

ఇంట్లో దుఃఖమే తాండవించింది రోజంతా.

మర్నాడు కాలేజీకి వెళ్ళేసరికి నవ్వుతూ ఆహ్వానించారు అమ్మాయిలందరూ. "ఏమోయ్ రాధా! మీ బద్ధూ మేష్టారు భలేవాడేనే మొత్తానికి. ఆహాహా ఏం హృదయం, ఏం వ్యక్తిత్వం?" అని మొదలుపెట్టారు.

ఒంటి మీద తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్లుంది రాధకి. కానీ ఏం మాట్లాడకుండా ఊరుకుంది.

క్లాసు రూములో బోర్డుమీద ఏమిటేమిటో వ్రాశారు. ఈ విషయం మగపిల్లలదాకా ఎలా పోయిందో లేకపోతే ఆడపిల్లలే బోర్డుమీద రాశారో తెలీలేదు రాధకి.

అంతులేని అభూత కల్పనలనూ, అవమానాలనూ భరించి ఇంటికి వచ్చింది రాధ.

ఉగ్రరౌద్రాకృతితో కన్పించాడు తండ్రి.

జనార్దనరావు సంగతి రమణకి కాలేజీలో తెలిసింది. ఆ వెంటనే ఇంటికి వచ్చి ఆ ముక్కా కాస్తా తండ్రికి చెప్పాడు. ఆ చెప్పటంలో మరి కాస్త జోడించి చెప్పాడు.


అసలే భార్గవి చేసిన పనితో బాధపడిపోతున్న ఆ తండ్రికి ఒళ్ళూపైనా తెలీలేదు. దాంతో రాధ ఒంటిమీద వాతలు తేలాయి.

"గడపదాటి అడుగు బయటపెట్టావంటే ఒళ్ళు చీరేస్తాను జాగ్రత్త. పుట్టింది ఆడపుటక - ఆ మాత్రం జ్ఞానం వుండక్కర్లే? నువ్వు కాలేజీలో చేరి ఉద్ధరించింది చాలు. ఇంక వెళ్ళకు-నా కడుపున చెడబుట్టారే మీరు" అని శాసించాడు చివరికి.

"ఆ పిల్ల అట్లా అయింది. నువ్విట్లా అయినావు - మరి మీకు పెళ్ళిళ్ళు చెయ్యలేకపోతిమి. ఎదిగిన పిల్లలాయె - మీరు మాత్రం ఏం చేస్తారు? పోనీ అతనెవరో మంచివాడేనా - తల్లిని నేను అనగూడదు గానీ - భార్గవిలాగే అతనితో వెళ్ళిపోలేకపోయినావూ? మిమ్మల్ని ఇట్లా ఇంట్లో పెట్టుకుని చూస్తూ ఎట్లా బతకనే నేను?" అని సగం కోపంగా, సగం బాధగా, సగం ప్రేమగా తల్లి దుఃఖపడింది తండ్రి లేనప్పుడు.

రాధ మ్రాన్పడి నుంచుంది. తల్లి — కన్నతల్లి పిల్లని 'లేచిపోలేకపోయావా?' అని అడుగుతూంటే కడుపులో చెయ్యిపెట్టి కలచినట్లైంది. ఆమె చేత అట్లా మాట్లాడించిన పరిస్థితులని తల్చుకుంటే.

ఏమైతేనేం తన మనసును అర్థంచేసుకోలేదు తల్లీ తండ్రీ. ఇంక తన మాట నమ్మరు. "పెళ్ళి- పెళ్ళి ఒక్కటే లక్ష్యమా బ్రతుక్కి? కలలో కూడా తనెప్పుడూ పెళ్ళి మాట 'అనుకోలేదే-ఆ మేష్టారు అట్లా చేశాడేమిటి? నేను ఏం అపకారం చేశాను ఆయనకి? నేను ఈ మాత్రంగానైనా బ్రతకటం దేవుడికి ఇష్టంలేదు కాబోలు. లేకపోతే ఏమిటిది? వన్నెలవిసనకర్రల్లాంటి అమ్మాయిలుండే కాలేజీలో, జిడ్డుమొహానికి నాకు ప్రేమలేఖ రాయటమేమిటి? అయ్యో భగవంతుడా! ఈ అపవాదు నా నెత్తిమీద వచ్చిపడిందే - దీన్ని కాదనే అవకాశమే లేదా?" అని విలవిలలాడిపోయింది రాధ.



ఎంబ్రాయిడరీ చేసిన గుడ్డలను ఎప్పుడూ వెనుకవైపునే ఇస్త్రీ చెయ్యాలి. ఇలా చెయ్యడం వల్ల ఆ డిజైన్లు బాగా కనిపిస్తాయి; దారాల మెరుపు కూడా పోకుండా ఉంటుంది.

తర్వాత చాకిరీలో మునిగిపోయింది - బ్రహ్మాండమైన నిర్లిప్తత ఏర్పరచుకుని. ఈ వార్త కాస్త ఆలస్యంగా చేరింది పద్మలతకి. వెంటనే రాధను చూడటానికి ఇంటికి వచ్చింది. తీరా చూసింతర్వాత 'అయ్యో! చూడకుండా వుంటేనే బావుండేది-రాధని ఈ అవస్థలో నేను చూడలేను' అనుకుంది చెమర్చిన కళ్ళతో — "ఇలా ఎన్నాళ్ళుంటావు రాధా!" అన్నది ఆమె గద్గద స్వరంతో.

రాధకి నోట మాట పెగలలేదు. గబుక్కున వంగి ఆవిడ కాళ్ళకు చుట్టేసుకుంది. వేడి కన్నీళ్ళు కురిశాయి ఆవిడ పాదాల పైన.

"ఛ - ఏమిటిది రాధా!" అంటూ లేవనెత్తి కన్నీళ్ళు తుడిచింది.

"ఎస్సెల్సీ ప్యాసైనావు గదా - ఏదైనా చిన్న ఉద్యోగం చూద్దాం రాధా! నువ్వు ఒక్కదానివీ నీ పొట్ట పోషించుకోలేక పోతావేమిటి? ఏ నింద అయినా భరించవచ్చుగానీ శీలాన్ని గురించిన నింద భరించలేమమ్మా!" అన్నది.

జానకమ్మ గబగబా వచ్చింది అంతలోకి.

"ఏమిటే ఈ ఆగడం? ఇందాకట్నించీ చూస్తున్నాను పరాయివాళ్ళతో మామీద చాడీలు చెప్తావా? అవ్వ. కన్నతల్లిని నేనిక్కడుంటే నీ బాధ వెళ్ళబోసుకోడానికి ఈవిడ దొరికిందా? నీకు సిగ్గెట్లా లేకపోయిందే" అంటూ రాధ జుట్టు పట్టుకుని లాగి "అమ్మా! తమరింక వెళ్ళరండి-మా పిల్లను ఈ మాత్రమైనా వుండనివ్వండి" అంటూ పద్మకి రెండు చేతులూ ఎత్తి దణ్ణం పెట్టేసింది ఆవిడ.

పద్మలత రాధవైపు జాలిగా చూసి నిట్టూర్చింది. గుమ్మం దాకా వచ్చి జానకమ్మను కాస్త ఇవతలికి పిలిచి అన్నది. "మీ అమ్మాయి వజ్రంలాంటిది. బొగ్గు అనుకుని కుంపట్లో వేసి కాల్చేస్తున్నారు మీరు. కన్నతల్లి అయివుండీ ఆ పిల్ల శీలానికా మచ్చ తెస్తున్నారు! నిజం నిలకడమీద తేలకపోదు. ఆ తర్వాత మీరు బాధ పడకనూ పోరు" అని.

పద్మలతగారిమీద తల్లికి ఇంత కోపం ఎలా వచ్చిందో తెలీలేదు రాధకి. తను కాలేజీలో చదవటం ఎంతమాత్రం అన్నయ్య కిష్టంలేదనీ, జనార్దనరావు ఉత్తరం అతనికి మంచి అవకాశం కల్గించిందనీ తెలియదు. ఒకసారి క్లాసులో అల్లరి చేస్తుంటే పద్మ అతణ్ణి తల వాచేట్లు చివాట్లు పెట్టిందనీ ఆ కోపం మనసులో పెట్టుకుని, రాధ చెడిపోవటానికి అవిడే కారణమని తల్లికి చెప్పాడనీ తెలియదు.

అతలాకుతలమైపోయింది రాధ మనసు. రకరకాల ఊహలు కెరటాల్లా ఎగిసి పడుతున్నాయి. తన మనసును తన అదుపులో పెట్టుకోలేకపోతున్నది.

ప్రపంచంలో అన్నిటికంటే విలువైన మాతృవాత్సల్యానికి తనెందుకు నోచుకోలేదు? అధిక సంతానంవల్ల—దుర్భర దరిద్రంవల్ల—తోటివిద్యార్థినులు క్రూరమృగాలకన్నా ఎక్కువ అమానుషంగా ప్రవర్తిస్తుంటే-ఒక్క రోజైనా పట్టించుకుని అదేమని మందలించ లేదు మేస్టారు — ఎందుకని? ఎంత మంచిగా వున్నా కాలేజీ స్టూడెంట్స్ బోర్డు మీద పేర్లెక్కించేశారే? తనేం పాపం చేసిందని.

ఒక్క పద్మ, సీత తప్ప తనను ఎప్పుడూ ఎవ్వరూ ఆపేక్షగా పలకరించ లేదేం? ఒక్క చిరునవ్వు

కోసం, ఒక్క చిన్ని హార్దికమైన పలకరింపు కోసం, ఒక్క ఓదార్పు కోసం, ఒక్క స్వల్ప సంతోషం కోసం ఎంత అలమటించి పోయింది ప్రాణం ఎంత క్షోభించింది. తను ఎటు చూసినా తిరస్కారమే—ఏంచేసినా అవమానమే. ప్రతిసారీ ఎదురుదెబ్బే. "ఛీ....ఎందుకిలా . బ్రతకటం?" అనుకుంటూ వెక్కి ఎక్కి ఏడ్చింది రాధ.

అందరి జీవితాల్లో కష్టసుఖాలు కలిసి వుంటే—రాధ జీవితంలో వున్నది ఒక్క దుఃఖమే. నిజానికి ఆమె జీవితంలో ప్రత్యక్షంగా వున్న ఆ బాధ ఏమీ లేదు. కానీ అనుభవించేదంతా కన్పించని చిత్రవధ. చిన్నతనం నించీ వక్రమార్గంలోనే నడిచింది ఆమె జీవితం - సరిదిద్దవచ్చు ఇప్పటికైనా-కానీ ఎవరికాశ్రద్ధ? ఇంట్లో వాళ్ళకా ఊహే వుంటే అసలిట్లా అయ్యేదికాదు. బయటి వాళ్ళు పూనుకుని చక్క జేస్తామంటే చెయ్యనివ్వరు. మహా వీరుడైన కర్ణుడిని ఆరు రకాల శక్తులుకలిసి లొంగదీసినట్లు అనేకమంది వ్యక్తులు తమకు తెలియకుండానే ఈ స్థితికి తీసుకువచ్చారు.

సీత వచ్చిందేసారి — పద్మలత వచ్చి వెళ్ళిన పది పదిహేను రోజులకి. ఆమె కళ్ళలో కోపపు జీర కదులుతుంది.

"ఇదుగో—ఈ ఉత్తరం చదవండి" అంటూ జనార్దనరావు రాధకి రాసిన ఉత్తరం ఇచ్చింది రాధ తండ్రికి. సీతా, పద్మలతా కలసి రాధ క్లాస్ మేట్స్ దగ్గిర ఎలాగో ఆ ఉత్తరం సంపాదించారు.

చి॥ రాధకు—

అభిమానంతో—

"నన్ను అర్థం చేసుకోవమ్మా! మా చెల్లెలు లక్ష్మీ అచ్చు నీలాగా వుంటుంది. ఈ మాట చెప్పటానికే ఎన్నోసార్లు ప్రయత్నించాను. కానీ నువ్వు విన్పించుకో లేదు. ఈ సంఘంలో మనచుట్టూ వున్నది మనుషులు కాదమ్మా—తోడేళ్ళు. ఒక్కగానొక్క చెల్లెలు లక్ష్మి అంటే నాకు పంచ ప్రాణాలు. దాని చిన్నప్పుడే మా అమ్మ పోయింది. మా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. ఆవిడ చేతిలో నానా బాధలూ పడింది లక్ష్మి. ఆవిడ బలవంతం వల్లనే లక్ష్మికి పదమూడేళ్ళకే పెళ్ళి నిశ్చయించాడు నాన్న. ఆ సంబంధం మంచిదికాదని చాలా మంది చెప్పారట. అయినా పిన్ని మాటకు ఎదురు తిరగ లేడాయన—నేను స్కూల్ ఫైనల్ చదువుతున్నాను అప్పుడు. నా మాట ఎవరూ వినిపించుకో లేదు.

ఇంక పెళ్ళయ్యాక నా చిన్నారి చెల్లెలు పడిన బాధలు ఏమని చెప్పను? ఆ అత్తగారు, ఆమె ఎలాంటి మనిషో నా కర్థం కాదు, చివరి కేం చేసిందో తెలుసా అమ్మా! పదిహేనేళ్ళైనా నిండని బంగారు తల్లిని, చంద్రబింబంలా వెలిగే నా చెల్లెల్ని చంపేసింది. ఎలాగో తెలుసా? మామూలుగా కాదు. రెండు చేతులూ కట్టేసి ఒంటి నిండా కిరసనాయిలు పోసి నిప్పంటించి క్రూరంగా చంపింది. పెద్ద డాక్టరు అంతటి ఘోర మరణం తానంతవరకూ చూడలేదన్నాడు. తర్వాత ఏడాది తిరగలేదు—లక్ష్మి భర్త మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. అలాంటి వాడికి మళ్ళీ ఎలా పిల్లనిచ్చారన్న ప్రశ్నే లేదు మన దేశంలో.

ఎంత చిత్రమో చూడు—నీకూ మా లక్ష్మికీ ఏం తేడా లేదు. తన మొహమూ ఎప్పుడూ నీ మొహం లాగే దీనంగా వుండేది. నేను ఉద్యోగంలో. . చేరగానే నా చెల్లెల్ని సుఖ పెట్టాలని ఎంతో ఆరాటపడేవాణ్ణి. నా చదువు పూర్తికానే లేదు—నా చెల్లెలి నూరేళ్ళ జీవితం ఆహుతైపోయింది దౌర్జన్యానికి—నిన్ను చూసిన క్షణం నించీ నా చెల్లెలు బతికొచ్చి నట్లే వుందమ్మా! కనీసం నీకైనా నన్ను సహాయం చెయ్యనీ. నువ్వెందుకంత దిగులుగా వుంటావో నాకు చెప్పు—నాకు చేతనైన సాయం చేస్తాను. మా ఇంటి అడ్రసు రాస్తున్నాను. ఒక్కసారి రా- మీ వదిన కూడా చాలా మంచిది. మే మిద్దరం కూడా మీ ఇంటికి వస్తాం తర్వాత—పిలుస్తావా ఈ కొత్త అన్నయ్యని మరి—

జనార్దనరావు.



ముదురుగా ఉన్న బెండకాయలను పారెయ్యకుండా, వాటిని చిన్న ముక్కలుగా తరిగి, ఉప్పు వేసి ఎండ బెట్టాలి. ఆ తర్వాత కావలసినప్పుడు వాటిని నూనెలో వేయించి తింటే బావుంటాయి.

రాధ తండ్రి కళ్ళల్లోంచి బొట బొటా కన్నీళ్ళు రాలుతున్నాయి.

అంతలో లోపల్నుంచి పక్క వీధిలో వున్న ఆయుర్వేదం డాక్టరు బయటి కొచ్చాడు.

"అమ్మాయి పరిస్థితి ఏం బావున్నట్లు లేదు—సందించింది. ఇంగ్లీషు మందుల వల్ల బాగవుతుందేమో—మీ ప్రయత్నం చేసుకోండి — గవర్నమెంట్ హాస్పటల్లో జేర్పిస్తే మంచిది" అని చెప్పి వెళ్ళాడాయన.

కింద కూలబడి బావురు మన్నాడు రాధ తండ్రి. గబుక్కున లోపలికి పరిగెట్టింది సీత.

స్పృహలో లేని రాధను మెల్లిగా మృదువుగా నాలుగు సార్లు పిలిచింది. కొద్దిగా కళ్ళు తెరిచింది రాధ గుర్తు పట్టినట్లుగా ఆమె కళ్ళల్లో సన్నని వెలుగు కన్పించింది.

"మీరు మంచి వారు మేడమ్—నా ప్రేమలేఖ లాక్కోకండేం — పద్మా మేడమ్ తో కూడా చెప్పండి. చాలా రహస్యం" అంటూ కిసుక్కున నవ్వింది పిచ్చి పిచ్చిగా—

సీతకి కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

కూర్చుని ఆమె తల నిమురుతూ "లేదమ్మా- నేనూ లాక్కోను — పద్మా లాక్కోదు. అయినా నీ కప్పుడు జనార్దనరావు మేష్టారు రాసింది ప్రేమ లేఖ కాదమ్మా. నువ్వు వాళ్ళ చెల్లెల్లా వున్నావని రాశారంతే; కావలిస్తే ఇక్కడి కొచ్చి చెప్తానన్నారు — కానీ నేనే వద్దన్నాను మీ వాళ్ళంతా అపార్థం చేసుకుంటారని. మీ క్లాస్ మేట్సంతా నిన్ను బాధ పెట్టినందుకిప్పుడు చాలా ఇదవుతున్నారు. నీకు ఒంట్లో బాగోలేదని తెలిసి ఇక్కడికి వచ్చి చూసి క్షమాపణ చెప్పుకుంటామన్నారు. కానీ నేనే చెప్పా, రాధకి క్షమాపణ అక్కరలేదర్రా! మీరు రియలైజ్ అయితే చాలునని. పిచ్చిపిల్లా! ఇంత మాత్రానికి ప్రాణం మీదికి తెచ్చుకుంటారా ఎవరన్నా? నీకేం ఫరవాలేదు. హాస్పిటల్ కి తీసుకువెళుతున్నాం" అంటూ అనునయంగా మాట్లాడింది.

ఎంత తెరుద్దామన్నా అప్పటికే మూతలు పడుతున్న రాధ కళ్ళల్లో-కృతజ్ఞత, హాయి, సంతోషం, తృప్తి, నిశ్చింత వెల్లివిరిశాయి.

"మేడమ్" అనబోయింది కానీ ఆ పిల్ల గొంతు పెగలలేదు. అతి ప్రయత్నం మీద ఆమె చెయ్యి తన చేతులతో గట్టిగా పట్టుకుంది.

"మేడమ్ గారండీ! టాక్సీ తెచ్చేశా" అంటూ పరిగెత్తుకొచ్చాడు రాధ తండ్రి—పితృహృదయం పొంగి పొర్లుతుండగా.... □